# మనసిది నీకోసం

**ఏదో స్టేషన్లో ఆగింది రైలు.**

ఒక్కసారి కిటికీలోంచి బయటకు చూసి, మళ్లీ తన ఒళ్లో ఉన్న నవల వైపు దృష్టి మళ్ళించింది మానస.

" ఇక్కడ కిటికీ దగ్గర కూచుందాం డాడీ .... ఇక్కడ చోటుంది " అంటూ తన ఎదురుగా ఉన్న కిటికీ దగ్గరికి ఓ చిన్నారి పాప రాగానే, అప్రయత్నంగా తల ఎత్తింది. మళ్ళీ, సరిగ్గా అప్పుడే ఆ పాప వెనక నిలబడిన అతను కూడా చూశాడు ఆమె వైపు. ఒక్క నిముషం ఇద్దరూ ఒకరి నొకరు అలా చూస్తూ ఉండిపోయారు. ఒకరినొకరు గుర్తించా రనేందుకు చిహ్నమే ఆ ఇద్దరి కళ్ళల్లోనూ తొంగిచూసిన ఆశ్చర్యం .... ఆశ్చర్యంతో పాటు మాటల్లో చెప్పలేని ఆనందం .... ఎంతో కాలంగా మనసులో దాగి వున్న కోరికని, అడగకుండానే ఈ విధంగా హఠాత్తుగా తీరిన సంతోషం, ఉక్కిరిబిక్కిరి చేసింది ఇద్దర్నీ.

" కూచో డాడీ " చెయ్యి పట్టుకు లాగింది పాప.

పాప పక్కన, ఆమెకెదురుగా కూర్చున్నాడు.

ఇద్దరి కళ్లలోనూ కదులుతున్నాయి ఎన్నో ప్రశ్నలు .... ఎన్నెన్నో ప్రశ్నలు .... పాప సంబరంగా కిటికీలోంచి బయటికి చూస్తోంది. రైలు కదిలింది.

" బావున్నావా ? " అడగాలని ఉన్న ఎన్నో ప్రశ్నలని ఆ నాలుగక్షరాల్లో కుదించుకునే ప్రయత్నం మొదట అతనే చేశాడు.

కళ్లతో చిన్నగా నవ్వి, తల ఊపింది బాగానే ఉన్నానని ....

" నువ్వూ ? " అదే ప్రశ్న, అడగకుండా ఉండలేని మనసు అడగనే అడిగింది.

" బానే ఉన్నాను "

" డాడీ .... డాడీ .... అవి కొంగలేనా ? " ఇటు తిరిగింది పాప.

" ఔనమ్మా .... "

" ఎన్ని కొంగలో, అబ్బా ! బావున్నాయి కదూ ? "

" చాలా కొంగలు .... బావున్నాయి .... "

ఆ జవాబుతో తృప్తిపడి మళ్ళీ అటు తిరిగిపోయింది పూర్తిగా కిటికీ వైపు.

" పాప పేరేమిటి ? " ముద్దుగా ఉన్న పాప వంక, ముచ్చటగా చూస్తూ అడిగింది మానస. ఎవరీ పాప అని అడగనక్కరలేదు .... డాడీ అని పిలుస్తోంది .... ఇంక అడిగే అవసరం ఏవుంది ?

" ప్రత్యూష " చెప్పాడు పాప పేరు.

చటుక్కున అతని కళ్ళల్లోకి చూసింది ఆ పేరు వింటూనే. అతని మొహంలోని భావాలు చదవలేకపోయింది....తన మనసులో ఆలోచనల్ని ఆపలేక పోయింది.

*

" నా కిష్టమైన పేరేమిటో తెల్సా ? "

" ఏమిటి? "

" ప్రత్యూష "

" అయితే తప్పకుండా గుర్తుపెట్టుకుంటాను "

" ఏం "

" మనకి పాప పుట్టినప్పుడు పేరు కోసం వెతుక్కోనక్కరలేదు. ఆ పేరే పెడదాం...." కొంటెగా నవ్వాడు మిత్ర.

" ఛీ....పో....అలూ లేదు, చూలూ లేదు, కొడుకుపేరు సోమ లింగం అన్నట్టుంది. మనం ఇంకా ప్రేమించుకోవడంలోనే ఉన్నాం. ఇంకా పెళ్ళన్నా కాలేదు. అప్పుడే నీ ఆలోచనలు...." సిగ్గుపడుతూ నవ్వింది.

" మానసా! "

" ఊ .... "

" నిన్ను తప్ప మరొకర్ని పెళ్ళి చేసుకోలేను నేను. ఏ కారణం చేతనైనా మన పెళ్ళి జరగకపోతే బ్రహ్మచారిగా ఉండిపోతానే తప్ప వేరొకర్ని చేసుకోలేను .... "

" నేను మటుకు నిన్ను తప్ప మరొకర్ని చేసుకోగలనా? ఆ ఊహకే తట్టుకోలేకపోతోంది. నా మనసు....నిన్ను పెళ్ళిచేసుకోలేని పరిస్థితే ఎదురయితే అజన్మాంతం ఇలా ఉండిపోతానే తప్ప మరొకర్ని చేసుకోలేను ....కానీ....మిత్రా....నాదో కోరిక...."

" ఏమిటి చెప్పు...."

" ఏ కారణంచేతైనా మన పెళ్ళి జరగక పోతే నువ్వు మటుకు అలా ఉండిపోకు. చక్కగా వేరే అమ్మాయిని చేసుకుని సుఖంగా జీవించు. నువ్వు హాయిగా, సంతోషంగా ఉండడమే నాక్కావల్సింది. "

"నాకు మటుకు నీ సుఖం అక్కరలేదనుకుంటున్నావా? ఈ విషయమే నేనూ చెప్పాలనుకుంటున్నాను. ఏ అడ్డంకులైనా వచ్చి మన పెళ్ళి

జరగకపోతే, నేనెలా ఉన్నా సరే, నువ్వు మటుకు సంతోషంగా సుఖంగా ఉండడమే నాక్కావల్సింది. మీ పెద్దలు చెప్పిన సంబంధం చేసుకుని ఆనందంగా జీవితం గడుపు. అంతే గానీ, నా గురించి దిగుల్తో బాధపడ కూడదు...."

ఆమె కళ్ళల్లో నీళ్ళు నిలిచాయి ఆ ఊహకే తట్టుకోలేక.

అతని గుండెల్లో కలుక్కుమంది ఆమె కంట తడి చూడలేక.

"మానసా! నీ కళ్ళల్లో నీళ్ళు నేను చూడలేను. నీ మనసు బాధ పడితే నేను సహించలేను. నువ్వు ఎప్పుడూ నవ్వుతూ, సంతోషంగా ఉండాలి" మనస్ఫూర్తిగా అన్నాడు అనురాగం నిండిన చూపుతో.

*

"ఎంతమంది పిల్లలు నీకు? ఈ పాప ఒక్కతేనా?" నోటి చివరి దాకా వొచ్చిన, ప్రశ్నని బలవంతాన వెనక్కి తీసుకుంది మానస. ఔను ఆ ప్రశ్న తను అడిగితే, అతను తర్వాత వీకెంతమంది పిల్లలని తనని అడగచ్చు.... అందుకే అడగకుండా ఉండడమే మంచిది.

"ఏం ఒక్కదానివే ప్రయాణం చేస్తున్నావు? మీ శ్రీవారెక్కడ?" అడుగుదామని నోటి చివరిదాకా వచ్చిన ప్రశ్నని వెనక్కి తీసుకున్నాడు మిత్ర. ఔను....తను ఆ ప్రశ్న అడిగితే, తర్వాత ఆమె మీ శ్రీమతి ఏదీ అని అడగవచ్చు, అబద్ధం చెప్పలేడు....నిజం చెప్పి ఆమె మనసుని కలతపెట్టలేడు .... అందుకే ఆ ప్రశ్న తను అడగకుండా ఉండడమే మంచిది....

పరీక్షగా చూశాడామె వైపు. ఖరీదైన సిల్కుచీర కొంగు భుజ మీమ్మీదుగా నిండుగా కప్పుకుని, అది జారిపోకుండా ఎడమచేత్తో చివర్లు పట్టుకునిఉంది. పదిహేనేళ్ల కిందటికీ ఇప్పటికీ మరీ ఎక్కువగా,

కాకపోయినా వయసు తెచ్చిన సహజమైన మార్పుంది మనిషిలో. అప్పుడు సన్నజాజి రెమ్మలా ఉండేది .... దూకే సెలయేరులా కనపడేది .... ఎగిరే విహంగంలా తోచేది....

ఇప్పుడు ? .... వయసు తెచ్చిన మార్పు కనపడుతోంది ... ఆ అందం మటుకు చెక్కుచెదరలేదు. సన్నజాజుల మాల అందం ఇప్పుడు వయసులోని మార్పుతో వొచ్చిన నిండుదనంతో హుందాగా కనపడుతోంది. దూకే సెలయేరు అప్పుడు, నెమ్మదిగా ప్రవహించే నది ఇప్పుడు.

ఏ ఊళ్ళో ఉంటోందో ? వాళ్ళ శ్రీవారేం ఉద్యోగం చేస్తున్నారో? అడగాలని ఉన్నా అడగలేని పరిస్థితి.

" డాడీ .... డాడీ "

పాప పిలుపుతో కిటికీలోంచి బయటికి చూశాడు. ఆలోచనలని తాత్కాలికంగా అరికడుతూ.

అతను అటు తిరిగి పాపతో మాట్లాడుతుంటే, అప్పుడు చూసిం దతని వంక పరీక్షగా.

ఇన్నేళ్ళలో అతనిలో వచ్చిన మార్పుని గమనించింది.

అప్పుడు కొంటెదనం, కవ్వింపు ఉండేవి ఆ చూపుల్లో .... .... ఇప్పుడు ఒక రకమైన స్థిరత్వం నిండిన ఆ చూపుల్తో గంభీరంగా ఉంది ముఖం .... వయసు తెచ్చిన హుందాతనంతో మరింత అందంగా కనిపిస్తున్నాడిప్పుడు.

ఎంత బాగా గడచిపోయాయి ఆ రోజులు. ఎంత బాగుండేది ఆ జీవితం ! ఎవరికీ తెలియకుండా తామిద్దరూ రహస్యంగా కల్సుకోవడం కాలం తెలియకుండా కబుర్లు చెప్పుకోడం ఎన్ని ఆశలుండేవి ఇద్దరి

మనసుల్లో ! ఎన్ని కలలు కనేవారు తీపితీపిగా ! చెదిరిపోయాయి ఆ ఆశ లన్నీ. కరిగిపోయాయి ఆ కలలన్నీ. అవి తల్చుకుంటేనే మూగపోతుంది మనసు.

ఏదో స్టేషనొచ్చింది. ఆగింది రైలు.

" డాడీ .... డాడీ చాక్‌లెట్ కొనిపెట్టవా ? "

బిస్కట్స్, చాక్‌లెట్స్ అమ్మేవాడు కిటికీ పక్కగా వొచ్చి నిలబడ్డాడు.

" తీసుకో " జేబులోంచి డబ్బులు తీశాడు మిత్ర.

మురిపెంగా చూసుకుంది చేతిలోని చాక్‌లెట్స్ పాప.

" ఆ ఆంటీకూడా ఇయ్యి " మెల్లిగా అన్నాడు.

సిగ్గుపడుతూ చూసింది పాప. కొత్తవాళ్ళ దగ్గర తగని మొహమాటం.

" నువ్వే ఇయ్యి " రెండు తీసి డాడీ చేతిలో పెట్టింది.

ఆ చేతిని ముందుకు చాపాడు.

చిరునవ్వుతో, తల అడ్డంగా ఊపింది, వొద్దన్నట్టు.

" తీసుకో పర్వాలేదు. స్వీట్సు అంటే నీకిష్టమేగా ? "

ఆ మాట, ఆమెని అతని కళ్ళల్లోకి చూసేలా చేసింది.

నీకేవి ఇష్టమో నాకిప్పటికీ గుర్తే అంటున్నాయి ఆ కళ్ళు.

ఝల్లుమంది మనసు. అందుకుంది మరి కాదనకుండా.

అందుకుంటున్న ఆమె చేతిమీది మచ్చ చూడగానే మనసు జ్ఞాపకాలలోకెళ్ళింది.

" మరీ చిన్నపిల్లల్లా మన ఈ గంతులేమిటిసలు ? "

" ఏం మనం చిన్న పిల్లలం కాదా ? మీ తాతగారిని మా తాతగారిని అడిగితే, మనం చిన్నపిల్లలమని సర్టిఫికెట్లు కూడా ఇస్తారు కావలిస్తే " జవాబిచ్చాడు మిత్ర.

" ఔను పాపం ! చిన్నపిల్లలం కాబట్టే ఇలా ఎవరికీ తెలియకుండా ఎవరూ చూడకుండా తోటల్లో కల్సుకుంటున్నాం. పెళ్ళి చేసుకోవాలని కలలు కంటున్నాం " నవ్వాపుకుంటూ వెక్కిరించింది.

" మిత్రా. అదిగో ఆ కొమ్మ చివర దోర జామకాయ ఉంది. కొయ్యి, తిందాం "

" అన్నిట్లో మగవాళ్ళతో ఆడవాళ్ళు సమానం అని వాదిస్తావుగా ? నువ్వెక్కు చెట్టు " కవ్వించాడు.

ఉడుక్కుంది.

" ఆ మాత్రం చెట్టెక్కలేననుకున్నావా ? నేనే కోస్తాను చూడు " పైట బిగించి, భయపడుతూనే మెల్లిగా ఎక్కటం మొదలుపెట్టింది. చిన్నప్పటినుంచి ఇప్పటివరకూ ఎప్పుడూ ఒక్కసారి కూడా ఏ చెట్టూ ఎక్కలేదు. అలవాటు లేని పని. ఏదో పంతానికి ఎక్కిందే తప్ప పైకి ఎక్కగానే, ఆ భయానికి కళ్ళు తిరిగినట్టయ్యింది. ఒక్కసారిగా ఆ దోరకాయ ఉన్న కొమ్మ అందుకోబోయింది ముందుకు వంగి. అంతే.

ఆమె కిందపడటంతో గుండె ఆగినంతపనయ్యింది మిత్రకి.

కింద వున్న రాయి, సూదిగా ఉన్న రాయి గుచ్చుకుని పెద్ద దెబ్బే తగిలింది మానసకి. ఆగకుండా రక్తం కారుతుంటే ఇద్దరూ భయపడి పోయారు.

" సారీ నా మూలానే ఇంతపనయింది " బాధతో విలవిల్లాడి పోయింది మిత్ర మనసు. గబగబా నీళ్ళుతెచ్చి కడిగాడు.

అతని కళ్ళల్లో కదులుత్తున్న బాధావీచికలు గమనిస్తూ తన నెప్పి మర్చిపోయింది. కానీ, ఆ గాయం మర్చిపోలేదు ఆ చేతిమీద మచ్చని మిగల్చడం, ఆ నాటి జ్ఞాపకార్థంగా.

" వెరీ సారీ " అప్పుడే ఆమెకి ఆ దెబ్బ తగిలినట్టుగా నొచ్చుకుంటూ అప్రయత్నంగా గొణిగాడు ఆ మచ్చవంక చూస్తూ.

" ఏవిటి ? ఎందుకూ సారీ ? " అంటూనే, అతని చూపులు నిలచినచోట తన దృష్టిని పోనిచ్చింది.

జ్ఞాపకాలు అలలై మనసుని కదిపివేశాయి.

కళ్ళు చెమర్చి, చటుక్కున రెప్పలు వాల్చింది.

ఎన్నో అడగాలని. ఎన్నో చెప్పాలని ఎన్నెన్నో మాట్లాడాలని ఎంతగానో ఉన్నా అశక్తుడిలా ఉండిపోయాడు మిత్ర. గతస్మృతులకే పరిమితమైపోయింది మనసు

*

" ఇంత మంచి సంబంధం వొస్తే కాదంటావేమిటి? వాళ్ళంతట వాళ్ళుగా అడిగారు నిన్ను చూసి ఇష్టపడి. అంత లక్షాధికార్ల సంబంధం పెద్ద చదువు, మంచి ఉద్యోగంలో ఉన్న అటువంటి పెళ్ళి కొడుకుని, తల్లక్రిందులుగా తపస్సు చేసినా తీసుకురాగలనా నేను ? మన అంతస్తేమిటో, తాహతేమిటో నీకు తెలియనిదేముంది? నీ తర్వాత ఇంకా ముగ్గురు ఆడపిల్లలకి పెళ్ళిళ్ళు చెయ్యాలి నేను. ఈ సంబంధం నువ్వు చేసుకుంటే జీవితాంతం కలిమితో నువ్వు సుఖ పడటమే కాదు నీ చెల్లెళ్ళ పెళ్ళిళ్ళకి కూడా కాస్త సాయం చేయగలుగుతావు....నిన్నెక్కడో చూసి ఆ అమ్మాయినే చేసుకుంటానని ఆ అబ్బాయి చెప్పడంతో అతని తల్లిదండ్రులు ఉన్న ఒక్కగా నొక్క కొడుకు కోరిక పెళ్ళి విషయంలో కాదనడ మెందుకని మనస్ఫూర్తిగా ఒప్పుకున్నారు. ఇంత మంచి సంబంధం.... " ఎన్ని విధాలగానో నచ్చచెప్తున్నాడు మానస తండ్రి.

ఎప్పుడూ ఆ యింటికి రాని మిత్ర, తమ పెళ్ళి విషయం ఆమె తండ్రితో మాట్లాడదామని ఆ రోజే అడుగుపెట్టాడక్కడికి. బయట వరండాలోకి గట్టిగా వినిపిస్తున్న వాళ్ళ మాటలు అచేతనంగా నిలబెట్టేశాయి అతన్ని అక్కడే.

"నన్ను క్షమించండి నాన్నగారూ ఇన్నాళ్ళూ మీకు చెప్పనందుకు. ఇవాళో రేపో చెప్దామనే అనుకుంటున్నాను. నేనొకతన్ని ప్రేమించాను"

తెల్లబోయాడు.

"ప్రేమించావా? మన కులమేనా?" నీరసంగా ధ్వనించింది గొంతు.

"కాదు"

"కాదా?"

"కాదు .... మన కులం కాదు. పెద్ద ఉద్యోగస్తుడు కాదు .... ఆ చేసే చిన్న ఉద్యోగం కూడా ఏదో మూడు నెల్ల టెంపరరీ వేకెన్సీలో పనిచేస్తున్నాడు: ఉద్యోగ ప్రయత్నంలో ఉన్నట్టే లెక్క.

ఆస్తిపరుడూ కాదు. రెక్కలమీద ఆధారపడ్డ, మనబోటి మధ్య తరగతివాళ్ళలో కేవాస్తాడు. ఇంటికి పెద్ద కొడుకు. చెల్లెళ్ళు తమ్ముళ్ళు ఉన్నారు" వివరాలు చెప్పడం ముగించింది మానస.

"నీకు మతిపోయింది కాక నా మతి కూడా పోగొడదామను కుంటున్నావా? ఆ కుర్రాడితో నీ పెళ్లి జరగడానికి వీల్లేదు. ఏం చూసి అటువంటివాడిని ప్రేమించావు? మన కులం కాని వాడిని చేసుకుంటే రేపు నీ చెల్లెళ్ళ పెళ్ళిళ్ళు జరగాలా వొద్దా? నువ్వు చేసిన పనికి సిగ్గుతో, అవమానంతో జీవితాంతం మేమంతా తలెత్తుకోలేక చావాలని నీకు కోరికగా ఉందా? ఇదిగో ఇదే నా నిర్ణయం. చెపుతున్నాను విను. నువ్వు వాడిని చేసుకోవడం అంటూ జరిగితే నేను నూతిలో దూకడం ఖాయం...."

మరి అక్కడ నిలబడలేకపోయాడు మిత్ర. తన గదికెలా వచ్చి పడ్డాడో తనకే తెలియదు.

ఆలోచనలతో ఆ రాత్రంతా నిద్ర కరువే అయింది.

తనని చేసుకుంటే, బాధ్యతల బరువుతో, దరిద్రంతో కుమిలి పోవడమే తప్ప, సుఖమెక్కడుంటుంది మానసకి. కడుపునిండా తిండైనా పెట్టలేని తనకి భార్య కావడం కంటే ఆ లక్షాధికార్ల ఇంటి కోడలైతే జీవితాంతం సుఖపడుతుంది. చెల్లెళ్ళ పెళ్లికి కూడా ఆర్థికసాయం చేయగలుగుతుంది. ఆ తండ్రికి మనశ్శాంతి నివ్వగలుగుతుంది. తనని చేసుకుంటే ఆ తండ్రికే దూరమవుతుంది. నూతిలో దూకుతానన్నాడాయన. అంత ఘోరం తన మూలాన జరగకూడదు. జరగడానికి వీల్లేదు. నిజంగా మానసని, మనస్ఫూర్తిగా తను ప్రేమిస్తున్నట్లయితే ఆమె సుఖాన్నే కదా తను కోరుకోవాలి .... ఔను .... ఆమె సుఖశాంతులతో ఉంటే అదేకదా తనకి ఓదార్పు. తన జీవితం నిస్సారంగా గడిచినా పర్వాలేదు. ఆమె జీవితం ఆనందమయంగా, ఏ కష్టాలూ లేకుండా గడచిపోతే అంతకంటే తనకి కావల్సిందేముంది? — ఔను మానస సుఖంగా ఉండాలి. దారిద్ర్యంతో బాధపడకూడదు — ఏదో నాల్రోజులు మొదట్లో తన గురించి బాధపడినా పర్వాలేదు గానీ, తనని చేసుకుని తండ్రి ఆత్మహత్యకి కారణమై జీవితాంతం ఆ బాధతోనూ, దారిద్ర్యం తోనూ నలిగిపోవడం ఎందుకు?

స్థిరంగా ఒక నిశ్చయానికొచ్చాడు మిత్ర తెలతెలవారుతుండగా.

ఎప్పుడూ తామిద్దరూ బయట ఎక్కడైనా కల్సుకోవడమే తప్ప ఆమె తన గదికి రావడమంటూ జరగలేదు. అటువంటిది, ఆ రోజు హఠాత్తుగా మానస తన గదికి రావడంతో, ఆశ్చర్యంతో మిత్ర, కాస్త తడబడినమాట నిజం. తను వొచ్చినందుకు సంతోషంలాంటిదేమీ అతని మొహంలో కనిపించలేదు మానసకి.

నాలుగురోజులుగా కనిపించడం మానేశావేం అంటూ దెబ్బలాడాలని వచ్చింది. కానీ ఆ మాటే రాలేదు అతని మొహం చూస్తుంటే. ఎందు కలా ఉన్నాడు ?

" ఒంట్లో బావుండలేదా మిత్రా ? "

" బాగానే ఉంది ? "

" మరి అలా ఉన్నావేం "

" ఎలా ఉన్నాను ? "

ఆశ్చర్యమే అనిపించింది మానసకి. ఇంత ముభావంగా ఎప్పుడూ మాట్లాడలేదు తనతోటి ? ఈ రోజేమైంది ? మిత్ర ఆలోచనలు మరోలా ఉన్నాయి.

ఇంట్లోవాళ్ళు తమ పెళ్ళికి ఒప్పుకోలేదని చెప్పడానికి వొచ్చిందేమో! పోన్లే — అదే కదా తనకు కావల్సింది — అందుకే కదా, ఆమె తనని మెల్లిమెల్లిగా మర్చిపోవాలనే ఆమెని కల్సుకుందుకు వెళ్లడం మానేశాడు తను.

గోడకి వేళ్ళాడుతున్న ఫ్లాస్కు అందుకుని, చెప్పులు తొడుక్కున్నాడు " ఇక్కడే పక్కన హోటలుంది. కాఫీ తెస్తాను, ఒక్క నిమిషం "

" ఇప్పుడు కాఫీ ఏం వొద్దుగానీ, కబుర్లు చెప్పు ముద్దుముద్దుగా " విసుక్కుంది.

అదేమీ పట్టించుకోనట్టే అన్నాడు. " ఇప్పుడు నువ్వు నా అతిథి కదా, కాఫీ అయినా ఇవ్వద్దూ. "

వెళ్ళిపోయాడు బయటికి.

అతని ప్రవర్తన అర్థం కాలేదు మానసకి. ఒక్క నాలుగురోజుల్లో ఎందుకిలా మారిపోయాడు — ఆలోచిస్తూనే, ఎదురుగా కిటికీలో కనబడిన వారపత్రిక చేతిలోకి తీసుకుంది. యధాలాపంగా పేజీలు తిరగేస్తుంటే, అందమైన దస్తూరితో ఓ కాగితం కనిపించింది. ఎంత బావుందో ఈ రైటింగ్ అనుకుంటూ కాగితం చేతిలోకి తీసుకుంది. కంటికెదురుగా అందులో కనిపించిన ఆ వాక్యాలు చూస్తూనే ఉలిక్కిపడింది. అది మరొకళ్ళ ఉత్తరం అని కూడా మరిచి కళ్ళు అక్షరాల వెంట పరుగులు తీశాయి. " చిరంజీవి మిత్రని మీ నాన్న దీవించి వ్రాయునది.

ఎవర్నో ప్రేమించానని, ఉద్యోగం రాగానే ఆ పిల్లనే పెళ్ళాడుతానని రాశావు. మన కులం కాని పిల్లని చేసుకుంటే, రేపు నీ చెల్లెలి పెళ్ళి అసలే కాకుండాపోతుంది, ఈ వంకతో. అసలే కట్నం సమస్యతో, ఎన్ని సంబంధాలు చూసినా ఒక్కటీ కుదర్లేదు. ఇప్పుడు నువ్వు కులం కాని పిల్లని చేసుకుంటే ఇంక జన్మలో దానికి పెళ్ళి కాదు. జీవితాంతం అదీ, నేనూ, మీ అమ్మా ఏడుస్తూ బతుకుతుంటే నువ్వు సుఖంగా ఎలా బతగ్గలవో ఆలోచించు. ఇంట్లోవాళ్లని ఏడిపించి నువ్వు బావుకునేదేమిటి? నువ్వాపిల్లని చేసుకుంటే మీ అమ్మ ఏ నుయ్యో, గొయ్యో చూసుకుంటానంటోంది. ఇక్కడ నీకో మంచి సంబంధం వొచ్చింది — బాగా డబ్బున్నవాళ్ళ సంబంధం. ఒక్కతే కూతురు. పిల్ల కాస్త రంగు తక్కువనుకో, అయితేనేం బుద్ధిమంతురాలు. కావల్సినంత కట్నం ముట్టచెప్తార్ట. ఆ కట్నం డబ్బుతో నీ పెద్ద చెల్లెలి పెళ్ళి చేసెయ్యొచ్చు. నా గుండెలమీంచి ఒక బరువు దింపినవాడివవుతావు. అందుకని, నువ్వు ఆలస్యం చెయ్యకుండా త్వరలో వొస్తే ఈ సంబంధం సెటిల్ చేసేసుకుందాం. అన్నట్టు ముఖ్యమైన మరో సంగతి ఏమిటంటే నీ కాబోయే మామగారు, పెళ్లి అయ్యాక వెంటనే నీకు ఉద్యోగం వేయిస్తానన్నారు.

అందుచేత ఈ సంబంధం వొదులుకోడం మంచిది కాదు, ఏ రకంగా చూసినా కూడా. నువ్వు ప్రేమించిన అమ్మాయిని చేసుకుంటే రేపు సంసారంలో సుఖం, శాంతీ దొరకవు. ఎందుకంటే ప్రేమ కడుపు నింపదు కాబట్టి. ఇంకా వారంరోజుల్లో నీ టెంపరరీ ఉద్యోగం గడువు అయ్యే పోతుంది కదా, వెంటనే బయల్దేరివొచ్చెయ్యి, ఆ దైవో గా నే. ఈ సంబంధానికి అడ్డు చెప్పావంటే మీ అమ్మ బతకదు.

ఇట్లు

ఆదిశేషయ్య "

అంతా చదివిన మానసకి, అసలు సంగతి అర్థమైపోయినట్టని పించింది. ఇదన్నమాట అసలు విషయం. ఇందుకే, తనని కల్సుకో డానికి రావడం మానేశాడన్నమాట —

చేతిలో ఉత్తరం, మళ్ళీ ఆ వారపత్రికలో పెట్టేసి, కిటికీలో పెట్టేసిందా పుస్తకం.

ఒక్కసారిగా ఎంతో నీరసం వొచ్చేసినట్టయింది—దిగులు, బాధ మనసుని చుట్టుముట్టాయి — పంటి బిగువున కన్నీరాపుకుంది. ఛ—ఛ ఎందుకూ ఏడవడం? నిజంగా, మనస్ఫూర్తిగా తను మిత్రని ప్రేమించి నట్టయితే అతని సుఖమే కదా కోరుకోవాలి, అతను సంతోషంగా, సుఖంగా ఉండడం కంటే కావాల్సిందేముంటుంది తనకి? — వాళ్ళ నాన్నగారు రాసిందీ నిజమేగా? తనని చేసుకుంటే అతను సుఖపడేదేముంటుంది, ఆ డబ్బున్నవాళ్ళ పిల్లని చేసుకుంటే అతనికి ఉద్యోగమూ వొస్తుంది, వాళ్ళ పెద్ద చెల్లెలి పెళ్ళికి కట్నమూ వొస్తుంది. వాళ్ళమ్మగారు ఆత్మ హత్యకి పాల్పడకుండానూ ఉంటారు—అతని కుటుంబంలో వాళ్ళందరితో కలిసి మిత్ర సుఖంగా, సంతోషంగా ఉండడమే తనక్కావల్సింది.

" కాఫీ తీసుకో! ఏమిటాలోచిస్తున్నావు? "

ఉలిక్కిపడింది— ఎదురుగా మిత్ర కాఫీ కప్పుతో.

వాళ్ళ నాన్నగారు ఉత్తరం రాసిన విషయం గురించి ప్రస్తావిస్తాడే మోనని ఎదురుచూసింది మౌనంగా.

మా నాన్నగారిలా రాశారుగానీ, నేను, నిన్నుతప్ప మరొకర్ని చేసుకోనంటూ ఖచ్చితంగా చెప్తాడేమో వినాలన్న ఆశ లోలోపల.

మౌనంగా తనూ కాఫీ తాగడం ముగించాడు మిత్ర.

డబ్బుగల సంబంధం ఒకటి వొచ్చిందనీ, ఆ అమ్మాయిని చేసుకోమని ఇంట్లో వాళ్ళు బలవంత పెడుతున్నారనీ, కానీ, నేను నిన్ను తప్ప మరొకర్ని చేసుకోననీ చెప్తుందేమో వినాలన్న ఆశ అతనికి. కానీ, ఆ ఆశ నిరాశే అయింది.

మొత్తమ్మీద ఇద్దరూ, ఎవరి ఆలోచనల్లో వారుండి, మూగవారే అయ్యారు.

ఇద్దరి కోరికా ఒకటే—అవతలి వారి ఇష్టప్రకారమే జరగాలని, ఇద్దరి ఆశయం ఒకటే రెండోవారు సుఖ, శాంతుల్తో జీవితం గడపాలని.

*

ఆ లక్షాధికార్ల సంబంధం చేసుకోమని ఇంట్లోవాళ్ళ ఒత్తిడి ఎక్కువవడంతో మరి నిగ్రహించుకోలేక, మిత్రని కల్సుకుందుకు బయల్దేరిందారోజు మానస. అతను గది ఖాళీచేసి వెళ్ళడమే కాదు, ఊర్నించే వెళ్ళిపోయాడని తెల్సి హతాశురాలైంది.

ఆ రోజే ఇంట్లోవాళ్ళతో చెప్పేసింది తను పెళ్లి చేసుకోనని. ఊరు మార్పు కావాలనిపించింది. ఉద్యోగం వొస్తే, ఆ అవకాశం వొదిలిపెట్ట

కుండా వెళ్ళి చేరింది. మిత్రకి దూరమై అప్పటికీ, ఇప్పటికీ పెళ్ళి చేసుకోకుండా ఇలా ఉండిపోయింది.

*

దిగవల్సిన స్టేషను రానే వొచ్చింది. పాప చేతిని పుచ్చుకుని లేచాడు మిత్ర.

"నన్ను క్షమించు మానసా — ఇన్నేళ్ళ తర్వాత నువ్వు కనిపిస్తే నోరారా నీతో మాట్లాడుకుందుకు నోచుకోని అభాగ్యుడిని నేను. కుశల ప్రశ్నలు నిన్ను ఏవడిగినా కుడా, తిరిగి అవే ప్రశ్నలు నన్ను వేస్తావేమోనన్న భయం నన్ను మాట్లాడనివ్వలేదు. మీ శ్రీవారేం చేస్తారని గానీ, పిల్లలెంతమంది అని గానీ నేను నిన్ను అడిగితే, నువ్వు నా శ్రీమతి గురించి, పాప గురించీ అడుగుతావన్న భయంవేసింది. నిన్ను పెళ్ళిచేసుకోలేకపోతే జీవితాంతం నేను బ్రహ్మచారిగానే ఉండిపోతానని నీతో చాలాసార్లు అన్నాను. గుర్తుందా? నిన్ను చేసుకోలేకపోయాక మరెవర్నీ చేసుకోవాలని నా కనిపించలేదు — అందుకే — అందుకే బ్రహ్మచారిగానే ఉండిపోయాను నిన్నే మనసులో ఆరాధిస్తూ— ఈ పాప నా కన్న కూతురు కాదు. నా తమ్ముడి కూతురు. మూడు నెలల పాపగా ఉన్నప్పుడే, నా తమ్ముడూ, భార్యా యాక్సిడెంట్లో ఒకేసారి పోయారు. అప్పటినుంచీ నేనూ, మా అమ్మా కళ్ళల్లో పెట్టుకుని పెంచుతున్నాం పాపని. పాపకి తండ్రినయ్యాను.... నీ కిష్టమైన ఆ ప్రత్యూష పేరు పాపకి పెట్టుకున్నాను .... నువ్వు మీ ఇంట్లో వాళ్ళు చెప్పిన సంబంధం చేసుకుని సుఖంగా ఉన్నావనే అనుకుంటున్నాను. నేను కనపడకుండా వెళ్ళిపోతే నీకూ, మీ యింట్లో వాళ్ళకి మేలు జరుగుతుందని నీతో చెప్పకుండానే ఊరు విడిచి వెళ్ళిపోయాను. నన్ను క్షమించు, కానీ నీ సుఖంకోసం నేనలా చెయ్యడంలో తప్పులేదేమో కదూ?"

ఈ మాటలన్నీ మిత్ర గొంతులోనే ఉండిపోయాయి. ఒక్క మాట కూడా

పైకి చెప్పలేకపోయాడు, చెప్తే మానస బాధపడుతుందని, నా కోసం నువ్వు పెళ్ళిచేసుకోకుండా మోడులా ఉండిపోతే నేను పెళ్ళిచేసుకుని హాయిగా సంసారం చేసుకుంటున్నానే అన్న చింత, దిగులూ ఆమెని కుమిలిపోయేలా చేస్తాయన్న బాధ అతన్ని చెప్పనివ్వలేదు తన విషయాలేవీ.

దిగబోతూ, వెళ్ళొస్తానని కళ్ళతో చెప్పాడు గుండెల్లోంచి పొంగి వొస్తున్న ఆవేదనతో గొంతు విప్పలేక.

బదులిచ్చింది కళ్ళతోనే మానస.

" నన్ను క్షమించు మిత్రా — నీ కుటుంబాన్ని గురించి ప్రశ్నలు నేనేమైన వేస్తే, తిరిగి నువ్వు నా గురించి అడుగుతావన్న భయంతో నిన్నేమీ అడగలేదు. నేను, నిన్ను గాక మరొకర్ని నా భర్తగా ఊహల్లో కూడా భరించలేను నేను — అందుకే — అందుకే — పెళ్ళిచేసుకోకుండా ఇలా ఉండిపోయాను. ఈ విషయం — ఇప్పుడు మాటల్లో నీకు తెల్సిందంటే నువ్వు చాలా బాధపడతావు. సుఖంగా ఉన్న నీ మనసు కష్టపెట్టడం నా కిష్టంలేదు — నువ్వయినా సుఖంగా ఉండడమే నాకు కావల్సింది. అందుకే...ఈ సంగతి నీకు తెలియకుండా జాగ్రత్తపడ్డాను...."
వెళ్ళిపోతున్న మిత్రావంకే చూస్తూ లోలోపల అనుకుంది మానస. 000